
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు

3

శనివారం 29 మార్చి 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	శనివారం	ఆదివారం
కర్నూలు	6:35	4:53
నంద్యాల	6:32	4:53

కైలాసవాహనంపై శ్రీశైలేశుడు

- మహాదుర్గగా దర్శనమిచ్చిన అమ్మవారు
- నేడు ప్రభోత్సవం, నందివాహన సేవ
- శ్రీగిరిపై కొనసాగుతున్న ఉగాది ఉత్సవాలు

శ్రీశైలం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఇల కైలాసంగా వెలుగొందుతున్న శ్రీశైలం మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కైలాస వాహనంపై విహరించారు. భ్రమరాంబికా దేవి మహాదుర్గ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవానికి ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధపుష్పాలతో ముస్తాబు చేసి కైలాస వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం రాజగోపురం నుంచి క్షేత్రవీధుల్లోకి తీసుకొచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామోత్సవం ఎదుట కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.





గ్రామోత్సవం ఎదుట హారతులు ఇస్తున్న యువతులు

నేడు నందివాహనసేవ, మహా సరస్వతి అలంకారం

ఉగాది మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం సాయంత్రం ఆదిదేవులకు ప్రభోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు నందివాహన సేవ, మహాసరస్వతి అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారు. రాత్రి 10 గంటలకు వీరాచార్య విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలు కొనసాగుతాయని ఆలయ అధికారులు వెల్లడించారు.



కోలాటాల ప్రదర్శన



కైలాస వాహనంపై ఆది దంపతులు





పరీక్ష కేంద్రాల తనిఖీ

ప్రశాంతంగా పరీక్షలు: ఆర్‌జేడీ శ్యామ్యూల్

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్యామ్యూల్ శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లాలోని పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్సీ, బీసీ బాలుర గురుకుల హైస్కూల్స్, బలపనూరు జడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేసిన సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ కడప, సత్యసాయి జిల్లాల్లో జరిగిన సంఘటనలను సీరియస్ తీసుకుని అక్కడ పరీక్షల పర్యవేక్షకులపై చర్యలను తీసుకున్నామన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని అన్నారు. డీఈవో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ శుక్రవారం 130 కేంద్రాల్లో నిర్వహించిన జీవశాస్త్రం పరీక్షకు 25,141 మంది విద్యార్థులకు గాను 24,592 మంది హాజరయ్యారని అన్నారు. ఏడు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు 19 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశామన్నారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలను సజావుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



డీఈవో కార్యాలయంలో ఆర్‌జేడీ శ్యామ్యూల్



మళ్లీ ఉత్కంఠ..!

- మార్కెట్‌యార్డు కమిటీలపై వీడని సస్పెన్స్
- తాజాగా నంద్యాల, పాణ్యం ఛైర్మన్ల ప్రకటన
- ఆశావహుల్లో మొదలైన అలజడి
- తలలు పట్టుకుంటున్న ప్రజాప్రతినిధులు

నంద్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన మార్కెట్ యార్డు నామినేటెడ్ పదవుల ఎంపిక ప్రక్రియకు ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం తెరదించినట్లైంది. పలుమార్లు వాయిదా పడుతూ వచ్చినప్పటికీ ఆశావకులు ఏమాత్రం నిరూత్సాహం చెందలేదు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 47 మార్కెట్ యార్డుల ఛైర్మన్లను ఎంపిక చేస్తూ జాబితాను విడుదల చేసింది. ఆ జాబితాలో జిల్లాలోని ఇద్దరికి మాత్రమే చోటు దక్కింది. మిగిలిన వారిలో ఆందోళన నెలకొంది. జిల్లాలో 8 మార్కెట్ యార్డు కమిటీలు ఉన్నాయి. వాటిలో తాజాగా నంద్యాల కమిటీ ఛైర్మన్‌గా గుంటుపల్లి హరిబాబు, పాణ్యం మార్కెట్ యార్డుకు అంగజాల గీత ఎంపికయ్యారు. మిగిలిన ఆరు కమిటీల ఎంపికపై ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటం, ఒత్తిడి పెరగడంతో ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే 1:3 ప్రకారం ఆశావహుల లిస్ట్ రాజధాని అమరావతికి చేరింది. ఈ నేపథ్యంలో ఎవరికి ఛైర్మన్ పదవి దక్కుతుందోనని ఆయా వర్గాల్లో టెన్షన్ మొదలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి నెలలు గడుస్తున్న నామినేటెడ్ పదవులు భర్తీ తరచూ వాయిదా పడడంతో పోటీ తీవ్రత మరింత పెరిగింది. తాజాగా ప్రభుత్వం నంద్యాల మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు గుంటుపల్లి హరిబాబు, పాణ్యం మార్కెట్‌యార్డుఛైర్మన్‌గా అంగజాల గీతను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని మార్కెట్‌యార్డులకు రాయలసీమ జిల్లాల్లోనే ప్రత్యేక స్థానం ఉంది. దీంతో ఆయా పదవులకు సైతం టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల్లో కీలకంగా పనిచేసిన కార్యకర్తలు సైతం పదవులకు పోటీపడుతున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు స్థానికంగా లేకపోయినా.. వారు ఎక్కడుంటే అక్కడకు పరుగులు పెడుతున్నారు. ఛైర్మన్ పదవితోపాటు వైస్‌ఛైర్మన్లు, డైరెక్టర్ల పోస్టులకూ డిమాండ్ పెరిగింది.

జిల్లాలోని మార్కెట్‌యార్డులు

1) నంద్యాల
2) పాణ్యం
3) ఆళ్లగడ్డ
4) డోన్
5) నందికొట్కూరు
6) ఆత్మకూరు
7) బనగానపల్లె
8) కోవెలకుంట్ల

ప్రజాప్రతినిధుల వెంట నేతలు

ఎవరికైనా నామినేటెడ్ పదవి దక్కాలంటే... స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో పాటు సిఫార్సు ఉండాల్సిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలో ఆయా పదవుల ఎంపిక విషయంలో కూడా ఆయా ప్రజాప్రతినిధులు సైతం తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం. ఎక్కడ చూసినా ఆయా పదవుల కోసం ఆశావకుల జాబితా చూస్తే.. ఎక్కువగా ఉందని సమాచారం. దీంతో పార్టీ కోసం ఎవరెవరు ఎంత మేర కృషి చేశారోనని టీడీపీ పునఃపరిశీలన చేస్తోంది. సామాజిక వర్గాలు, పార్టీకోసం శ్రమించిన తీరు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నామినేటెడ్ పోస్టుల భర్తీలో అధినాయకత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది.

విధేయతకు పట్టం

- నంద్యాల మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా గుంటుపల్లి హరిబాబు
- సంబరాల్లో టీడీపీ శ్రేణులు



మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో హరిబాబు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఆదేశాలను జవదాటని నైజం ఉన్న గుంటుపల్లి హరిబాబుకు నంద్యాల మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి దక్కింది. నంద్యాల మండలం రైతునగరం గ్రామానికి చెందిన గుంటుపల్లి వెంకటేశ్వర్లు తెలుగుదేశం పార్టీలో కీలకమైన కార్యకర్త. ఆయన కుమారుడు హరిబాబు 2020లో పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, 2023లో రాష్ట్ర రైతువిభాగం ఉపాధ్యక్షుడిగా, 2024లో పార్టీ పరిశీలకుడిగా పనిచేశారు. ప్రస్తుతం హరిబాబు మార్కాపురం నియోజకవర్గ పరిశీలకుడిగా పనిచేస్తున్నారు. శుక్రవారం మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా ప్రకటించడంతో గ్రామంలో రైతునగరం గ్రామంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటుపల్లి హరిబాబు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పాణ్యం మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా అంగజాల గీత



పాణ్యం మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా ఎంపికైన అంగజాల గీత

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గం గడివేముల మండలం దుర్వేసి గ్రామానికి చెందిన అంగజాల గీతకు పాణ్యం మార్కెట్‌యార్డు ఛైర్మన్ పదవి దక్కింది. రిజర్వేషన్ ప్రకారం పాణ్యం మార్కెట్‌యార్డు పదవి బీసీ మహిళకు కేటాయించడంతో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్ భార్య అంగజాల గీతకు ఈ అవకాశం రావడంతో పార్టీ గడివేముల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో కీలకమైన పాణ్యం మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



బంతి బంతికి బెట్టింగ్

- ఐపీఎల్ పోటీలతో ఊపందుకున్న క్రికెట్ బెట్టింగ్
- రంగంలోకి పందెంరాయుళ్లు
- నిఘాతోనే అడ్డుకట్ట

నంద్యాల క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ట్వంటీ-ట్వంటీ ఐపీఎల్ క్రికెట్ పోటీల సీజన్ ప్రారంభమైంది. బంతిబంతికి ఉత్కంఠ, క్షణాల్లో మారే ఫలితం ఆద్యంతం ఉద్వేగంతోపాటు కావాల్సినంత వినోదం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)క్రికెట్ అభిమానులకు అందిస్తోంది. వినోదం మాట అటుంచితే బెట్టింగ్‌రాయుళ్లకు మాత్రం ఐపీఎల్ కాసుల వర్షం కురిపిస్తోంది. జిల్లా కేంద్రంతోపాటు పట్టణ, మండల ప్రాంతాలకు ఈ బెట్టింగ్ మానియా పాకింది.



కమీషన్ల కోసం...: నగరాలకు మాత్రమే పరిమితమైన బుకీలు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ బెట్టింగ్ దందా సాగిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో స్థానికంగా ఉండేవారిని ఏజెంట్లుగా నియమించుకొని వ్యవహారాన్ని సాగిస్తున్నారు. వీరు బెట్టింగ్‌లు వేసేవారిని గుర్తించి వారి వివరాలు ఫోన్ నంబర్లతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తున్నారు. ఇలా చేసేందుకు ఏజెంట్లకు కమీషన్ల రూపంలో భారీగా ముట్టజెపుతున్నారు. యువత బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, వీటివల్ల జీవితాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని పోలీస్ శాఖ చైతన్యం చేసేలా తగిన చర్యలు చేపట్టేవిధంగా అవగాహన కార్యక్రమాలు కల్పించాల్సిఉండగా ఆ దిశగా అడుగులుపడకపోవడంతో చాపకిందనీరులా బెట్టింగ్‌తతంగం జోరుగా నడుస్తోంది.

యువకులు, విద్యార్థులే లక్ష్యం..

జిల్లాలో అపార్ట్‌మెంట్లు, ఇంటర్నెట్ సెంటర్లను అడ్డాలుగా మార్చుకొంటూ బెట్టింగ్ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. యువకులు, విద్యార్థులే లక్ష్యంగా దళారులు బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. జిల్లాతో అనుబంధం ఉన్న కొందరు బుకీలు హైదరాబాద్, కర్నాటక, చెన్నై నగరాలతోపాటు స్థానిక ఏజెంట్లను ఏర్పాటుచేసుకొని ప్రొద్దుటూరు, బళ్లారి, తాడిపత్రి, మైదుకూరు తదితర ప్రాంతాలనుంచి చక్రం తిప్పుతూ బెట్టింగ్‌లను నడిపిస్తున్నట్లు సమాచారం. మండల కేంద్రాల్లో కొంతమంది రైతులు సైతం ఈ ఊబిలో కూరుకుపోయి పొలాలు అమ్ముకున్న పరిస్థితి కూడా గతంలో కనిపించింది. నంద్యాల పట్టణంలోని బుకీగా ఉన్న ఓ యువకుడు రూ.లక్షల్లో బెట్టింగ్ ద్వారా డబ్బు సంపాదించి అదేవిధంగా ఆ డబ్బును పోగొట్టుకొని కోట్లల్లో అప్పులు చేసుకొని సొంత ఊరినే వదిలేసి అజ్ఞాతంలో బతుకుతున్నాడు.

ఈజీ మనీ కోసం: ఈజీమనికి అలవాటుపడిన యువత బానిసలుగా మారుతున్నారు. ల్యాప్‌ట్యాప్‌లు, సెల్‌ఫోన్‌లు, మోటార్‌సైకిళ్లు తాకట్టు పెట్టి అధికవడ్డీలకు డబ్బులు తీసుకొని బెట్టింగ్‌లో డబ్బులు పోవడంతో తల్లిదండ్రులకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితుల్లో మానసిక కుంగుబాటుకు లోనవుతున్నారు. ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా గతంకంటే భిన్నంగా సెల్‌ఫోన్‌లోనే యాప్‌ల నుంచి జోరుగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు.

పోలీసుల నిఘాతోనే అడ్డుకట్ట

బెట్టింగ్‌లకు బానిసలుగా మారి అప్పుల ఊబిలో కూరుకొని ఎంతోమంది యువత ఆత్మహత్యలకు పాల్పడినఘటనలున్నాయి. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, జీవితాలను నాశనం చేసుకోవద్దని పోలీసులు చెబుతున్నప్పటికీ అవి కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమయ్యాయి. పోలీసుల నిఘాతో అడ్డుకట్టవేసే అవకాశం ఉంది.



ప్రత్యేక నిఘా ఏర్పాటు

జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లు జరగకుండా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటున్నాం. బెట్టింగ్‌లకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకొని సస్పెక్ట్ షీట్స్ ఓపెన్ చేస్తాం. యువత, విద్యార్థులు అత్యాశకుపోయి బెట్టింగ్‌లకు పాల్పడి అప్పుల ఊబిలోకి కూరుకుపోవద్దు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై నిఘా ఉంచాలి.

\- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



'పది' పరీక్ష వాయిదా!

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీ నిర్వహించాల్సిన పదో తరగతి పరీక్షను ఏప్రిల్ ఒకటో తేదీకి వాయిదా వేసినట్లు నంద్యాల డీఈఓ జనార్దన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 31వ తేదీ రంజాన్ పర్వదినం ప్రకటించడంతో ఆ రోజు నిర్వహించాల్సిన సోషియల్ స్టడీస్ పరీక్షను ఏప్రిల్ ఒకటో తేదీ మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, పరీక్షల సిబ్బంది గమనించాలని కోరారు.

ఉద్యాన పంటలను ప్రోత్సహించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీడుభూముల్లో ఉద్యానపంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో నాణ్యమైన ఉల్లి, మిర్చి, పసుపు పెంపకం కోసం హార్టికల్చర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వర్క్‌షాప్ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని దొర్నిపాడు, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల మండలాల్లో ఖరీఫ్ చివరిలో మూడు నెలలు మాత్రమే 2లక్షల ఎకరాల్లో శనగ పంటవేసి తర్వాత 9నెలల సమయమంతా బీడు భూములుగా వదిలేస్తున్నారని, ఆ భూముల్లో ఉద్యానపంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని అన్నారు. రైతుల పెట్టుబడి తగ్గించి తలసరి ఆదాయం పెరిగేందుకు ఉద్యాన పంటలు ఉపయోగపడతాని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అనుబంధ రంగాల జిల్లా అధికారులు, యూనివర్శిటీ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కన్నడిగులకు పూర్తిస్థాయి ఏర్పాట్లు

మహానంది ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



మహానంది, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం పురస్కరించుకొని మహానంది ఆలయాన్ని దర్శించే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దైవదర్శనం కోసం మహానందికి వచ్చే కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన వేలాదిమంది భక్తులకు క్షేత్రంలో ఏర్పాటు చేస్తున్న వసతి సౌకర్యాలపై ఈఓతో ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: ఉగాదికి వచ్చే భక్తుల అంచనా వేశారా?

జవాబు: దాదాపు లక్షమంది కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు మహానందీశ్వరుని దర్శనం కోసం ఒక్క ఉగాది పర్వదినం రోజు వస్తారని అంచనా. వేశాం. ఇందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రశ్న: ఉచిత దర్శనం అమలు చేస్తారా?

జవాబు: ఉచిత దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. నిరంతరం అమలు చేస్తాం.

ప్రశ్న: దర్శనం కోసం క్యూలో ఉండే భక్తులకు ఏవిధంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు.

జవాబు: స్వామి వారి దర్శనం కోసం క్యూలో ఉండే భక్తుల కోసం ఉచితంగా వాటర్ బాటిళ్ళు, ఫ్రూట్స్, మజ్జిగ పంపిణీ చేస్తాం.

ప్రశ్న: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారా?

జవాబు: దేవస్థానం విస్తీర్ణం 55 ఎకరాలు ఉండటంతో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఎక్కడ ఎలాంటి అపరి శుభ్రత లేకుండా ఉండేందుకు కోసం ప్రస్తుతం ఉన్న పారిశుధ్య సిబ్బందికి తోడు మరో పదిమంది తాత్కాలికంగా కార్మికులను నియమించి అపరిశుభ్రత లేకుండా చేస్తాం.

ప్రశ్న: ఉగాది పర్వదినం సందర్భంగా క్షేత్రంలో ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

జవాబు: వేసవికాలం దృష్టిలో పెట్టుకుని ఆలయ పరిసరాల్లో భక్తులు ఎండ వేడిమి నుంచి తట్టుకునేందుకు గ్రీన్ మ్యాట్లు, షామియానాలు, భక్తుల పాదాల రక్షణ కోసం మ్యాట్లతో పాటు తాగునీరు ఏర్పాటు చేశాం. లడ్డు ప్రసాదాలను అందుబాటులో ఉంచాం. విడిది కోసం దేవస్థానం ఎదుట టీటీడీ కల్యాణ మండపం, పోచా విశ్రాంతి భవనాలను అందుబాటులోకి తెచ్చాం. అలాగే భక్తులు వాహనాలు నిలిపేందుకు దేవస్థానానికి చెందిన 17 ఎకరాల్లో పార్కింగ్ స్థలం కేటాయించాం.

ప్రశ్న: దర్శనం ఏర్పాట్లు ఎలా చేస్తున్నారు?

జవాబు: కన్నడ భక్తులకు దర్శనం సమయంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉగాది రోజు పూర్తి స్థాయిలో నిరంతరం దర్శనం ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే మధ్యాహ్నం సమయంలో నివేదన తర్వాత రాత్రి 10 గంటల వరకు అమలు చేస్తున్నాం. అలాగే తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి దర్శనం కల్పిస్తున్నాం. ఉగాదిరోజున పంచాంగ శ్రవణం ఉంటుంది.



రంజాన్ సందడి

రంజాన్ ప్రత్యేకం

- టోపీలు, ఖురాన్ గ్రంథాల కొనుగోలు సందడి
- సాయంత్రం వేళల్లో కళకళలాడుతున్న దుకాణాలు


దుకాణంలో అత్తర్ సీసాలు

కర్నూలు కల్చరల్/నంద్యాల కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు అత్యంత ప్రీతికరమైన రంజాన్ మాసాన్ని భక్తి భావనలతో కొనసాగిస్తున్నారు. నిత్యం ఐదు పూటల నమాజ్‌లతోపాటూ రాత్రి వేళల్లో ప్రత్యేక తరావీహ్ నమాజ్‌లను ఆచరిస్తూ ఖురాన్ గ్రంథం పఠనం పూర్తి చేస్తున్నారు. మరోవైపు రంజాన్ మాసం సందర్భంగా వస్త్ర, పాదరక్షలు, టోపీలు, ఖురాన్ గ్రంథాలు, అత్తర్లు, సుర్మాలు వంటి వాటిని కొనుగోలు చేస్తున్నారు. కర్నూలు పాతనగరంలోని గడియారం ఆసుపత్రి, పూలబజార్, పెద్ద మార్కెట్, వన్‌టౌన్ తదితర ప్రాంతాల్లో రంజాన్ మాసం సందర్భంగా ఆయా దుకాణాలన్నీ కళకళలాడుతున్నాయి. అదేవిధంగా నంద్యాల పట్టణంలోని బైరేమల్‌వీధిలో వ్యాపారాలు జోరందుకున్నాయి. రంజాన్ పండుగకు మరో మూడు రోజుల సమయమే ఉండటంతో ముస్లింలు ఉత్సాహంగా వాటిని కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు ఎండ తీవ్రత బాగా ఉండటం, పగలంతా ఉపవాసం పాటిస్తూ ఉండటం వల్ల, సాయంత్రం ఇఫ్తార్ వేళ తర్వాత షాపింగ్ చేసేందుకు ముస్లింలు బారులు తీరుతున్నారు.

విభిన్న టోపీలు : ముస్లింలు ప్రార్థనల సమయంలో టోపీలు తప్పనిసరి. ఈ తెల్లటి స్కల్ క్యాప్‌ల ధర రూ.50 నుంచి ప్రారంభమవుతుంది. డిజైన్లతో కూడినవి రూ.100 నుంచీ రూ.250 వరకు ధరలు పలుకుతున్నాయి. ప్రార్థన మ్యాట్‌లతో కూడిన రుమాలు, లేదా హాజీ రుమాళ్లు చాలా ట్రెండీగా మారాయి. తక్కువ ధర కారణంగా పురుషులు కొత్త కొత్త టోపీలను కొనుగోలు చేసేందుకు ఇష్టపడతారు.




విక్రయానికి సిద్ధంగా ఉన్న టోపీలు

ఖురాన్ గ్రంథాలు ప్రత్యేకం: రంజాన్ మాసంలో ఖురాన్ గ్రంథాలు అందుబాటులో లభిస్తున్నాయి. ఈ మాసంలో విరివిగా లభించే గ్రంథాలను ఖరీదు ఎక్కువైనా కొనుగోలు చేస్తున్నారు. అలాగే ఈ గ్రంథాలను బహుమతి రూపంగానూ కొందరు అందజేస్తున్నారు. ఒకప్పుడు అరబిక్ బాషలోనే లభించే ఖురాన్ గ్రంథాలు నేడు ఆంగ్ల, తెలుగు భాషల్లోనూ లభిస్తున్నాయి. దీంతో అన్ని మాధ్యమాల వారు సులువుగా అర్థం చేసుకుని ఖురాన్ గ్రంథాన్ని పఠించే అవకాశం లభిస్తోందని పెద్దమార్కెట్ సమీపంలోని దీని బుక్ డిపో యజమాని మహమ్మద్ యూసుఫ్ తెలిపారు.



నేత్రాలకు రక్ష సుర్మా : రంజాన్ మాసంలో కళ్లకు సుర్మా పెట్టుకోవడం ఒక సంప్రదాయం. ఇది కంటికి చల్లదనంతోపాటూ దృష్టిని పెంచుతుందని పెద్దలు చెబుతారు. ఈ మాసంలో సుర్మాల విక్రయాలు బాగా ఉంటాయి. అలాగే ముస్లిం పెద్దలు దైవ ధ్యానంలో ఉన్నప్పుడు తస్బీలు చేతిలో ధరిస్తారు. వాటి పూసలను తిప్పుతూ ధ్యానం పాటిస్తారు. ఈ మాసంలో విభిన్న రంగుల్లో, డిజైన్లలో తస్బీలు కూడా లభిస్తున్నాయి.

వర్ణాలు... పరిమళాలు : అత్తర్, పెర్ఫ్యూమ్‌లలో స్వచ్ఛమైన పువ్వులు, గంధపుచెక్కలు వంటివి ఉపయోగించి తయారు చేస్తుంటారు. వీటిలో జన్నతుల్, ఫిరదోస్, మజ్మా, షాజహాన్, తమన్నా, నాయబ్, బకూర్, మెకల్లత్, ఖస్, జాఫ్రాన్ తదితర రకాలు మార్కెట్లో లభిస్తున్నాయి. ఆల్కాహాల్ లేని అత్తర్లను ఎంపిక చేసుకోవడంలో ముస్లింలు ఆసక్తి చూపిస్తారు. అసలైన అత్తర్లు ఉపయోగించే వారి దుస్తులు కూడా రెండు మూడు పర్యాయాలు ఉతికినా వాటి వాసన అలాగే ఉంటూ పరిమళాలు వెదజల్లుతుంటాయి.


కర్నూలు పాతబస్తిలోని మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న ముస్లింలు

నియోజకవర్గాల పునర్విభజన వాయిదా వేయాలి

జేవీవీ అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పత్తి ఓబులయ్య తదితరులు

కర్నూలు కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నియోజిక వర్గాల పునర్విభజన అంశాన్ని మరో పాతికేళ్లకు వాయిదా వేయాలని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, జేవీవీ ఆధ్వర్యంలో 'డీలిమిటేషన్ వరమా ? శాపమా?' అనే అంశంపై సదస్సు జరిగింది. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తలుగా డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి, విశ్రాంత రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు సి. రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 84వ రాజ్యాంగ సరవణ చట్టం ప్రకారం 2026లో నియో జక వర్గాల పునర్విభజన కేంద్ర ప్రభుత్వం చేపట్టనుందని అన్నారు. అదే జరిగితే ప్రస్తుత దేశ జనాభా ఉజ్జాయింపు లెక్కల ప్రకారం ఉన్న లోక్‌సభ సీట్లు 543 అలాగే ఉంచినప్పటికీ యూపీ లోక్‌సభ సీట్లు 80 నుంచీ 92కు, బీహార్‌లో 40 నుచీ 50 పెంచాల్సి ఉంటుందని అన్నారు. ఇంకోవైపు ఏపీలో సీట్లు 25 నుంచి 20 తగ్గితే, తెలంగాణలో 17 నుంచి 15కు, తమిళనాడులో 39 నుంచీ 32కు, కేరళలో 20 నుంచీ 14కు తగ్గే అవ కాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి ప్రతాప రెడ్డి, రాష్ట్ర నాయకుడు గజల్ మహమ్మద్ మియా, రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మన్సూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాలకు ముస్తాబు

- అనాదిగా ఎద్దులబండ్లు, గాడిదల ప్రదక్షిణ
- ఆలయం చుట్టూ బురదమట్టి
- చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి


కల్లూరులోని అమ్మవారి ఆలయం చుట్టూ నీటితో నింపిన నిర్వాహకులు



కల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో కొలువైన చౌడేశ్వరీదేవి ఆలయం ఉగాది ఉత్సవాలకు ముస్తాబైంది. ఈమేరకు కార్యనిర్వాహక అధికారి గుర్రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పోలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కల్లూరులోని అమ్మవారి ఆలయంలో శ్రీదేవీ వసంత రాత్రి దీపోత్సవాలు (జ్యోతులు) ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆనాదిగా చౌడేశ్వరీదేవి ఆలయం చుట్టు ఉగాది పండుగ నాడు ఎద్దులబండ్లు, గాడిదలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. ఈ అరుదైన వేడుకను చూసేందుకు ప్రజలు, భక్తులు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలివస్తారు.

చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు: ఉగాది పండుగను పురస్కరించుకుని చౌడేశ్వరీ అమ్మవారి జ్యోతి మహోత్సవాలు రెండు రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. ఈనెల 30న ఆదివారం అర్ధరాత్రి నుంచి భక్తులు తయారుచేసిన జ్యోతులతో కల్లూరు ఊరువాకిలి నుంచి ఊరేగింపుగా తరలివచ్చి సోమవారం ఉదయం కల్లూరులోని చౌడేశ్వరీ అమ్మవారికి సమర్పిస్తారు. అదేవిధంగా 31న కూడా అమ్మవారికి జ్యోతులను సమర్పించి మొక్కులను తీర్చుకుంటారు. ఈమేరకు ఆలయ నిర్వాహకులు ఉగాది వేడుకల్లో భాగంగా అమ్మవారి ఆలయం చుట్టూ మట్టితీసి బురదతో నింపారు.


ఆట వస్తువులు ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదు
- మంత్రి టీజీ భరత్
- 'మీ సమస్య - మా పరిష్కారం' కార్యక్రమానికి శ్రీకారం
- కలెక్టర్ పి. రంజిత్‌బాషా సహా వివిధ శాఖల అధికారులు హాజరు


వినతులు స్వీకరిస్తున్న మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు గుర్తించి తక్షణం పరిష్కరించడమే లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. కర్నూ లు నియోజకవర్గం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణ పరి ష్కారం చూపాలనే ఆశయంలో 'మీ సమస్య - మా పరిష్కారం' సరికొత్త కార్యక్రమానికి స్థానిక శ్రీఆర్య ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ పి. రంజిత్‌బాషాతో మంత్రి టీజీ శుక్ర వారం శ్రీకారం చుట్టారు. కర్నూలు నగరపాలక సంస్థ అధికారులతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. వివిధ సమస్యలపై 144 మందికి పైగా వినతి పత్రాలు ఇచ్చారు. మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి. రంజిత్‌బాషా ప్రజలు వినతులను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లా డుతూ ప్రజలు మధ్యలో ఉంటూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. ప్రతి సోమవారం కలెక్టర్, ఎస్పీల అధ్యక్షతన ప్రజా సమ స్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వినతలు స్వీకరించి పరిష్క రిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, టౌన్ డీఎస్పీ బాబు ప్రసాద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అలరించిన ఉగాది కవి సమ్మేళనం


కవి సమ్మేళనంలో ప్రసంగిస్తున్న డాక్టర్ చిన్నావుల వెంకట రాజారెడ్డి

కర్నూలు కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు కళ్యం సాహితీ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో, నందికొట్కూరు రోడ్డులోని వరసిద్ధి వినాయక దేవస్థానం కల్యాణ మంటపంలో నిర్వహించిన 'ఉగాది' కవి సమ్మేళనం అసాంతం అలరింపజేసింది. విశ్వావసు నామ ఉగాది పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కవి సమ్మేళనానికి తెలుగు కళ్యం సాహితీ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చిన్నావుల వెంకట రాజారెడ్డి అధ్యక్షత వహించగా, సమన్వయ కర్తగా అరసం నగర గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎం. హరికిషన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా వెంకట రాజారెడ్డి మాట్లాడుతూ తెలుగు వారికి అత్యంత ముఖ్యమైన ఉగాది పండుగను పురస్కరించుకొని ఏటా కవి సమ్మేళనాలు ఏర్పాటు చేస్తూ ఔత్సాహిక కవులను తగిన రీతిలో సత్కరిస్తున్నామని చెప్పారు. ఈ కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

మాజీ సైనికుడైతే మాకేం?

- భూమి రికార్డులు తారుమారు చేసిన అధికారులు
- ఏడాదిగా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న డి. గోవింద్‌రెడ్డి
- స్పందించని అధికారులు

కర్నూలు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆయన దేశ రక్షణ కోసం సైన్యం (సీఆర్‌పీఎ‌ఫ)లో పని చేశారు. పదవి విరమణ సందర్భంలో ప్రభుత్వం ఇచ్చిన సాగు భూమి ఆధారంగా 20 ఏళ్లుగా జీవిస్తున్నారు. ఆ భూమి రికార్డులను రెవిన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో మార్చేశారు. అయ్యా..! నేనో మాజీ సైనికుడిని.. నా భూమి రికార్డులు సరిచేసి న్యాయం చేయమని ఏడాదిగా రెవిన్యూ అధికారులు చుట్టూ ఆయన తిరుగుతున్నా కనికరించడం లేదు. హొళగుంద మండలం హొన్నూరు గ్రామానికి చెందిన మాజీ సైనికుడు డి. గోవిందరెడ్డి కన్నీటి వేదన ఇది. మండలంలోని హొన్నూరు గ్రామానికి చెందిన డి. కాంతరెడ్డి కుమారుడు డి. గోవిందరెడ్డి 1993 ఏప్రిల్ 24న సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా చేరారు. పదేళ్లకు పైగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో దేశ రక్షణ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల రక్షణలో పని చేశారు. 2013 నవంబరు 1న పదవి విరమణ చేశారు. కేంద్ర హోం శాఖ సిఫారసు మేరకు రెవెన్యూ అధికారులు హొన్నూరు రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నం.32/బీలో 5 ఎకరాలు డీ-పట్టా ఇచ్చారు. 2004 ఏప్రిల్ 2న ఖాతా నంబరు.245 కింద హొళగుంద మండలం తహసీల్దారు పట్టాదారు పాసుపుస్తకం కూడా ఇచ్చారు. ఐబీ, ఆర్ఓఆర్, అడంగ్.. తదితర రెవెన్యూ ఆన్‌లైన్ రికార్డుల్లో డి. గోవిందరెడ్డి పేరు నమోదు చేశారు. పదవీ విరమణ తరువాత వచ్చిన డబ్బు దాదాపు రూ.25 లక్షలు వెచ్చించి ఆ భూమిలో రాళ్లు తొలగించి, చదును చేసి సాగు భూమిగా అభివృద్ధి చేసుకున్నారు. డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో మామిడి ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. ఆ పంట కోసం ఎస్‌బీఐ బ్యాంకులో రుణం కూడా తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గతేడాది ఏప్రిల్ నెలలో ఆయనకు తెలియకుండా ఆన్‌లైన్ రికార్డులు మార్చేసి, ఈ భూమిని ఎవరికీ కేటాయించని ప్రభుత్వ భూమిగా చూపించారు. హొళగుంద మండల తహసీల్దారు, హొన్నూరు వీఆర్ఓ టి. సురంజనేయులను కలసి ఆయన తన భూమి రికార్డులు సరిచేసి న్యాయం చేయాలని కోరారు. తన వద్ద ఉన్న రికార్డులు చూపించారు. ఏడాది కావస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్లకు విన్నవించారు. అయినా ఫలితం శూన్యం.




హొళగుంద మండలం హొన్నూరులో 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చిన భూమిలో మామిడి సాగు చేస్తున్న మాజీ సైనికుడు డి.గోవిందరెడ్డి

ఆన్‌లైన్ రికార్డులు సరిచేసి న్యాయం చేయండి



సీఎస్ఆర్ఎఫ్ జవాన్‌గా పదేళ్లు పని చేస్తే.. ప్రభుత్వం జీవనాధారం కోసం 20ఏళ్ల క్రితం 5 ఎకరాల సాగు భూమి ఇచ్చింది. ఏడాది క్రితం ఆన్‌రికార్డులు మార్చేశారు. అన్ని రకాల రాకార్డులు చూపించాను. అయినా నాపై కనికరం చూపడం లేదు. పీజీఆర్ఎస్‌లో పది సార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా ఆన్‌లైన్ రికార్డులు సరిచేసి న్యాయం చేయాలి.

- డి. గోవిందరెడ్డి, మాజీ సైనికుడు, హొన్నూరు గ్రామం, హొళగుంద మండలం:

వీఆర్వో, టీడీపీ నాయకుడి మధ్య ఘర్షణ

● గాయపడ్డ వీఆర్వో వెంకటేశ్వర్లు


గాయపడ్డ వీఆర్వో వెంకటేశ్వర్లు

సి.బెళగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఒకటవ వీఆర్వో వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు ఆదిత్యరెడ్డి మధ్య ఘర్షణ జరిగింది. మిగులు భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఒకరినొకరు చొక్కాలు పట్టుకుని కొట్టుకున్నారు. ఇది గమనించిన పక్కన ఉన్న రైతులు ఇద్దరినీ విడిపించారు. గాయపడ్డ వీఆర్వోను మండలంలోని వీఆర్వోలందరూ కలిసి చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ పురుషోత్తంను వివరణ కోరగా వీఆర్వోపై ఘర్షణ జరిగిన విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమస్యను పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య

కర్నూలు క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్వామిరెడ్డనగర్‌లో ఓ గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్నారు. రెండు నెలల క్రింద స్వామిరెడ్డినగర్‌లో నివాసముంటున్న కోటమ్మ అనే మహిళ ఇంటికి ఓ మహిళ వచ్చారు. తన పేరు షాహీనా అని, తాను అనాథను అని, ఓ పది రోజులు ఇల్లు బాడుగ ఇస్తే ఏదైనా పని చూసుకుని వెళ్లిపోతానని ప్రాథేయపడ్డారు దీంతో కోటమ్మ అనే మహిళ ఆమెకు ఇంటిని అద్దెకి ఇచ్చారు. అయితే కోటమ్మ భర్త అనారోగ్యం వల్ల తరుచూ నెల్లూరు వెళ్లి వస్తున్నారు. దీంతో అద్దెకు దిగిన మహిళ గురించి పెద్దగా పట్టించుకోలేదు. శుక్రవారం ఆ మహిళ ఉంటున్న ఇంటిలో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు తలుపులు పగులకొట్టి చూస్తే లోపల గుర్తు తెలియని మహిళ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించారు. మృతురాలి శరీరంపై, కుడిచేతిపైన లాజర్ అనే అక్షరాలతో పచ్చబొట్టు ఉంది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఆచూకి తెలిసిన వారు త్రీటౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ శేషయ్య తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు


నిందితుల అరెస్టును చూపిస్తున్న పోలీసులు

ఆత్మకూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన ఓ దొంగతనం కేసుకు సంబంధించిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ రాము శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద గల ఓ బీరువాల దుకాణంలో ఈ నెల 25న రాత్రి గాయబ్ అనే వ్యక్తి నిద్రిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఆయన వద్దకు వచ్చి కడియంతో గాయపరిచి సెల్‌ఫోన్‌తో పాటు రూ.50 దోచుకున్నట్లు తెలిపారు. దీంతో బాధితుడు కేకలు వేయడంతో ఇద్దరు దొంగలు బైక్‌పై పరారయ్యారని చెప్పారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బందిపోటు దొంగతనం కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇందులో ఆత్మకూరు పట్టణానికి చెందిన ముర్తుజావలి, రమణ అనే ఇద్దరు దొంగలను పట్టణ శివార్లలోని ఉర్దూ స్కూల్ వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుంచి బైకును, కడియాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ఎస్సై నారాయణరెడ్డి, సిబ్బంది రవి, శివరామ్, లక్ష్మణ్, వెంకటస్వామి, రంగస్వామి, అమీర్ ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు.

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు ఉప లోకాయుక్త అండ

కర్నూలు లీగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పిడుగుపాటుకు మృతి చెందిన బాధితుల కుటుంబాలకు రాష్ట్ర లోకాయుక్త అండగా ఉంటుందని ఉప లోకాయుక్త పి. రజని తెలియజేశారు. చిత్తూరు జిల్లా పిప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎం. వరలక్ష్మి భర్త ఎం. రామకృష్ణ పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. మృతుడి భార్య ఎం.వరలక్ష్మి రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి కింద ఎక్స్‌గ్రేషియా సహాయం కోసం దరఖాస్తు చేసుకుంది. ఎక్స్‌గ్రేషియా అందకపోవడంతో ఆమె ఉప లోకాయుక్తకు ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసి ఎక్స్‌గ్రేషియా చెల్లించే విషయాన్ని పరిశీలించాలని ఆదేశించింది. ఈ మేరకు స్పందించిన రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ డైరెక్టర్ బాధితురాలికి రూ.12 లక్షలు అందజేశారు.

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

వెలుగోడు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అనుమానంతో ఓ వ్యక్తి భార్యను గొడ్డలితో దాడి చేసి హత్య చేసిన ఘటన శుక్రవారం వెలుగోడు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. మండలంలోని మోతుకూరు గ్రామ మజార గ్రామమైన తిమ్మనపల్లిలో ఇస్కాల చిన్న మధుకృష్ణ తన భార్య లక్ష్మీదేవి(35)పై అనుమానం పెంచుకొని ఇంటి వద్ద గొడవ పడ్డాడు. ఆమెపై గొడ్డలితో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు. మృతురాలు తల్లి వెంకటసుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

దేవనకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై తెర్నేకల్ గ్రామానికి చెందిన గిరిపోగు ప్రతాప్ (30)అనే యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన ముకెన్న, మునెమ్మ దంపతుల రెండో కుమారుడు ప్రతాప్ గ్రామంలో ఎలక్ట్రికల్, సప్లయర్ దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం జరిగిన గ్రామసభకు టెంట్ ఏర్పాటు చేశారు. సభ ముగిశాక సాయంత్రం టెంట్ పైపులు కిందకు దించుతున్న క్రమంలో పైనవున్న విద్యుత్ తీగను గమనించకపోవడంతో విద్యుదాఘాతానికి గురై, పైనుండి కిందపడ్డాడు. ప్రతాప్‌కు తల పగలడంతో వైద్యం కోసం అంబులెన్స్‌లో దేవనకొండ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు. చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఆలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి రేషన్ బియ్యం బొలేరో వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్న వారిని పట్టుకొని అందులో ఉన్న డ్రైవర్ ఇందన్న, షేక్షవలిను అరెస్టు చేసినట్లు ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి తెలిపారు. బొలేరోలో ఉన్న వాహనంలో ఉన్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిన్నహుల్తి, దేవనబండలలో చోరీలు

పత్తికొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నహుల్తి, దేవనబండ గ్రామాలలో మూడు ఇళ్లలో చోరీలు జరిగాయి. చిన్నహుల్తిలో వీరన్న ఇంటిలో 40వేలు నగదు 1.6గ్రాములు చోరీకి గురికాగా దేవనబండలో రంగన్న ఇంటిలో 40తులాల వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. కేసునమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నామని సీఐ జయన్న తెలిపారు.

పత్తికొండ గత ఈవో క్రిష్ణకుమార్‌పై చర్యలు

- సిబ్బంది జీతభత్యాలలో అవినీతి ఆరోపణలపై ఉత్తర్వులు

పత్తికొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీ ఈవోగా గతంలో పనిచేసిన క్రిష్ణకుమార్‌ను విధుల నుండి తొలగిస్తూ శుక్రవారం పీఆర్ అండ్ ఆర్‌డీ రాష్ట్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీ ఈవోగా పనిచేస్తున్న సమయంలో సిబ్బంది జీతాలలో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని రూ 1,33,27,673 విడుదల కాగా అందులో రూ 74,63,845 ఒకే వర్కర్ ఖాతాకు బదిలీ చేశారు. జీవో ఎంఎస్ నెం 432 పీఆర్ అండ్ ఆర్‌డీ 31.01.2013 నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేసినందుకు క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. ప్రస్తుతం అనంతపురం జిల్లా పామిడి ఈవోఆర్డీగా ఆయన విధులు నిర్వహిస్తున్నాడు.

పదోన్నతుల కోసం పడిగాపులు

● ఖాళీ సోస్టులు భర్తీ కాకపోవడంతో సిబ్బందిపై పనిభారం

● కర్నూలు మార్కెట్‌యార్డులో వ్యాపారుల మోసాలకు అడ్డుకట్ట ఏదీ..?


కర్నూలు మార్కెట్ యార్డు కమిటీ కార్యాలయం

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అత్యధిక పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరుగుతున్న కర్నూలు మార్కెట్ కమిటీ యార్డులో పదోన్నతుల కోసం అధికారులు, సిబ్బంది సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్నారు. మరోవైపు పదవీ విరమణ పొందిన వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో పనిభారం కొండలా పేరుకుపోతోందని అధికారులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వ్యాపారుల అక్రమాలను కట్టడి చేయడంలో అధికారులు, సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. రైతుల పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర అందించడంతో పాటు వ్యాపారుల అక్రమాలను అరికట్టడానికి అవసరమైన అధికారులు సిబ్బంది లేకపోతే ఎలా? అని కర్నూలు మార్కెట్ కమిటీ యంత్రాంగం ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఏటా ఈ మార్కెట్ కమిటికి పంట ఉత్పత్తుల విక్రయాలతో పాటు షాపుల అద్దె రూపేణా దాదాపు రూ.7 కోట్ల దాకా ఆదాయం వస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరిగే మార్కెట్ కమిటీలలో కర్నూలు మొదటి స్థానంలో నిలిచింది. కనీసం క్రయ విక్రయాలు ప్రతిరోజూ జరిగే మార్కెట్ కమిటీల్లోనైనా అధికారులను సిబ్బందిని నియమించడంలో మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర అధికారులు శ్రద్ధ తీసుకోవడం లేదని, దీని వల్ల తాము నష్టపోతున్నామనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు మార్కెట్ కమిటీలో ఒక సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీతో పాటు గ్రేడ్-1, 2 సెక్రటరీలు, అలాగే అసిస్టెంట్ సెక్రటరీలు ఇద్దరు ఉండాలి. ప్రస్తుతం గ్రేడ్-1 సెక్రటరీ పోస్టు ఖాళీగా ఉంది. అసిస్టెంట్ సెక్రటరీ పోస్టులు రెండు ఉండగా.. ఒక పోస్టులో ఉన్న అధికారిని పాణ్యం మార్కెట్ కమిటీకి డిప్యూటేషన్‌పై పంపారు. పాణ్యం మార్కెట్ కమిటీ యార్డులో పంట ఉత్పత్తుల విక్రయాలు జరగడం లేదు. అటువంటప్పుడు అక్కడకు కర్నూలు మార్కెట్ కమిటీ నుంచి పంపాల్సిన అత్యవసర పని ఏముందో ఉన్నతాధికారులకే తెలియాలని పలవురు అంటున్నారు. అలాగే సూపర్‌వైజర్లు పది మంది ఉండాల్సి ఉండగా.. కేవలం నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వారు కూడా పదోన్నతులు లభిస్తే అసిస్టెంట్ సెక్రటరీలుగా పక్క మార్కెట్ కమిటీలకు వెళ్లేందుకు ఆశగా ఎదురు చూస్తున్నారు. కేశవరెడ్డి, శివన్న, నాగేష్, సూపర్‌వైజర్లు అసిస్టెంట్ సెక్రటరీలుగా ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నా పదోన్నతులు లభించకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అధికారులు సీనియారిటీ జాబితాలో ఉన్న అసిస్టెంట్ సెక్రటరీలు, సూపర్‌వైజర్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు వారి ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రహదారుల అభివృద్ధికి రూ.600 కోట్లు

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి


టీడీపీ సభ్యత్వ కార్డులను అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మెరుగైన రహదారులకు రూ.600 కోట్లు కేటాయించినట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని మంత్రి కార్యాలయంలో బీసీ జనార్దన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. జిల్లా ప్రధాన రహదారులు, రాష్ట్ర ప్రధాన హైవేలల పథకం కింద రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.861 కోట్లతో సుమారు 20వేల కిలోమీటర్ల రోడ్లను గుంతల రహితంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. జిల్లా ప్రధాన రహదారులకు సంబంధించి 64 నియోజకవర్గాల్లో 86 పనులు చేపట్టి రూ.200 కోట్లతో 536 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో హైవేలకు సంబంధించి 99 నియోజకవర్గాల్లో 139 పనులు చేపట్టి రూ.400 కోట్ల వ్యయంతో 896.41 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మొత్తంగా 225 పనులకు రూ.600 కోట్లతో 1432.41 కిలో మీటర్ల మేర రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే 5 ఏళ్ల కాలంలో రాష్ట్రంలో రోడ్లకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి పెద్ద ఎత్తున రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం ఆవరణలో టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బీసీ జనార్దన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మకంగా టీడీపీ కార్యకర్తలు 63 వేల వరకు రికార్డు స్థాయిలో సభ్యత్వం చేశారన్నారు. మంత్రి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఒక ప్రాంతీయ పార్టీ కోటిమంది సభ్యత్వాలు నమోదు చేసిన ఘనత టీడీపీ యువ నాయకుడు లోకేశ్‌కే దక్కుతుందని అన్నారు. టీడీపీ నాయకులు అంబాల రామకృష్ణారెడ్డి, మూలే రామేశ్వరరెడ్డి, పెండేకంటి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నిర్మానుష్యంగా మారిన అనంతపూర్-అమరావతి ప్రధాన రహదారి


ఎండలకు నిర్మానుష్యంగా మారిన కొలిమిగుండ్ల శాంతినగర్ వీధి

సూర్య ప్రతాపం

● పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

● ఆర్టీసీ, పర్యాటక శాఖలకు ఎండదెబ్బ

● తగ్గిన బెలుం గుహల ఆదాయం


పర్యాటకులు లేక వెలవెల బోతున్న బెలుం గుహల్లోకి ప్రవేశించే ప్రాంతం

కొలిమిగుండ్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. రోజు రోజుకీ సూర్య ప్రతాపం అధికమవుతుండటంతో ప్రజలు పది దాటితే ఇంటికే పరిమితమవుతున్నారు. మరోవైపు ఎండల దెబ్బకు జన సంచారం తగ్గిపోవడంతో ఆర్టీసీ, పర్యాటక శాఖల ఆదాయానికి గండిపడుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు నమోదు కావడంతో ప్రజలు బెంబెలెత్తారు. దీంతో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు శీతల పానీయాల కోసం పరుగులు తీస్తున్నారు. మరోవైపు మధ్యాహ్నం అయితే చాలు ప్రధాన రహదారులు, వీధులు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్షల అనంతరం ఇంటికి వెళ్లే సమయంలో విద్యార్థులు ఎండల ధాటికి హడలిపోతున్నారు.

బెలుం గుహలకు తగ్గిన ఆదాయం

ఎండలు, ఉక్కపోత కారణంగా ప్రముఖ పర్యాటక కేంద్రం, ప్రపంచంలోనే రెండో అతి పెద్ద పొడవైన గుహలుగా పేరుగాంచిన బెలుం గుహలు సందర్శకులు లేక వెలవెలబోతున్నాయి. గత కొద్ది రోజులుగా తీవ్రంగా మారిన ఎండ దెబ్బ టూరిజం శాఖ ఆదాయానికి గండి కొడుతోంది. ఓవైపు ఎండలు, మరోవైపు విద్యార్థుల పది పరీక్షల కారణంగా బెలుం గుహలకు పర్యాటకుల తాకిడి పూర్తిగా తగ్గిపోయింది. ఈ ఏడాది మార్చి ఆరంభం నుంచే ఎండలు భారీగా పెరిగాయి. రెండు రోజులుగా నంద్యాల జిల్లాతో పాటు, కొలిమిగుండ్ల మండలంలో 42డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికి తోడు కొలిమిగుండ్ల మండలం మైనింగ్ ప్రాంతం కావడంతో భూమిలో వేడి మరింత అధికంగా ఉంటోంది. దీంతో ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే ఉష్ణోగ్రత్తలు కాస్త అధికంగానే నమోదవుతున్నాయి. మండుతున్న ఎండలతో పర్యాటకుల తాకిడి తగ్గి బెలుం గుహలకు ఆదాయం తగ్గినట్లు పర్యాటక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గతంలో రోజూ రూ.30 నుండి రూ.50, లక్ష రూపాయల వరకు ఆదాయం సమకూరేవి. కానీ వేసవి కారణంగా బెలుం గుహలకు ప్రస్తుతం రోజుకు రూ.10వేలకు మించడం ఆదాయం రావడం లేదు. మార్చి నెలలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఆదాయం మరింతగా తగ్గే ప్రమాదం ఉంది.


ఎగసిపడుతున్న మంటలు

లీకైన గ్యాస్.. త్రుటిలో తప్పిన ప్రమాదం

హొళగుంద, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : హొళగుంద మండల పరిధిలోని గజ్జెహల్లి గ్రామంలో శుక్రవారం బాషా అనే వ్యక్తికి చెందిన హోటల్‌లో ఉదయం 9 గంటల ప్రాంతంలో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్‌కు ఉన్న పైప్ నుంచి గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం సంభవించినట్లు బాధితుడు భాషా తెలిపారు. పైప్ నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో హోటల్ నుంచి బయటకు పరుగులు తీశారు. గ్యాస్ సిలండర్‌లో గ్యాస్ తక్కువ మోతాదులో ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. మంటలు పెద్ద ఎత్తున ఎగసి పడడంతో వంట సామగ్రితో పాటు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపాడు.

ఆదోనిలో చైన్ స్నాచింగ్

మహిళ మెడపై కత్తి పెట్టి బంగారు గొలుసు అపహరణ


బాధితురాలు లక్ష్మీ శ్వేత

ఆదోని, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆదోని పట్టణంలో చైన్ స్నాచింగ్ జరిగింది. శుక్రవారం పట్టపగలే ఓ వ్యక్తి.. మహిళ మెడలో ఉన్న బంగారు చైన్ తెంపుకుని పరారయ్యాడు. ఆదోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ కూత వేటు దూరంలోనే ఈ చైన్ స్నాచింగ్ జరిగింది. వెంకన్న పేటకు చెందిన లక్ష్మీ శ్వేత (32) అనే మహిళ ఇంట్లో తన కుమారుడికి హోంవర్క్ చేయిస్తుండగా ఒక్కసారిగా దుండగుడు ఇంటిలోకి ప్రవేశించాడు. అతడ్ని మహిళ ప్రతిఘటించింది. దీంతో నిందితుడు కత్తి చూపించి అరిస్తే పొడిచేస్తానని బెదిరించి.... మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును దొంగలించి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని పట్టుకునేందుకు సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

డబ్బులు ఇస్తారా.. చంపాలా?

● పెద్దతుంబళం పెట్రోల్ బంకులో కర్ణాటక దొంగల హల్‌చల్

● బీరువా పగులగొట్టి నగదు దొంగలించిన వైనం

● సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐ


పెట్రోలు బంకులో పనిచేస్తున్న వారిని విచారిస్తున్న డిఎస్పీ

ఆదోని రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం పెద్దతుంబళం పెట్రోల్ బంకులో దొంగలు హల్‌చల్ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో బొలేరో వాహనంలో ఐదుగురు మాస్కులు ధరించి పెద్దతుంబళం శివారులో ఉన్న ఎస్సార్ పెట్రోల్ బంకు వద్ద చేరుకున్నారు. అక్కడ పనిచేస్తున్న ఈరన్న, తాయప్పలను మారణాయుధాలతో డబ్బులు ఇస్తారా చంపాలా అని బెదిరించారు. వారు ఎదురు తిరగడంతో వారిపై దాడి చేసి పెట్రోల్ బంకులో ఉన్న బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.60వేల నగదును, రెండు సెల్‌ఫోన్లను తీసుకొని పరారయ్యారు. ఆదోని డీఎస్పీ హేమలత, రూరల్ సీఐ నల్లప్ప, ఎస్.ఐ మహేష్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ ముఠా కర్ణాటక రాష్ట్రం సింధనూరుకు చెందిన వారిగా ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపారు.

ప్రభుత్వ గృహాల్లో అనధికార వ్యక్తుల నివాసం

● 507 మందికి నోటీసులు

కల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల గృహాల్లో అనధికారికంగా నివాసం ఉంటున్న వారికి రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేశారు. గత మూడు నెలల క్రితం రెవెన్యూ అధికారులు సర్వే చేయగా దాదాపు 507 మంది ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ గృహాల్లో నివాసం ఉన్నట్లు గుర్తించారు. ఈమేరకు శుక్రవారం సి.క్యాంపులోని ప్రభుత్వ గృహాల్లో ఉంటున్న వారందరికీ సచివాలయ వీఆర్వోలు ఇంటింటికీ వెళ్లి ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారు. అయితే నోటీసులు ఇవ్వడానికి వెళ్లిన వీఆర్వోలపై కొందరు వ్యక్తులు ఖాళీ చేయబోమని చెబుతూనే దూషణలకు గిగినట్లు సమాచారం. ఈవిషయంపై తహసీల్దారు శివరామ్ వివరణ కోరగా గతంలో సి.క్యాంప్ ప్రభుత్వ గృహాల్లో అనధికారికంగా నివాసం ఉంటున్న వారిని గుర్తించామని, ఉన్నతాధికారుల ఆదేశాలతో వారందరికీ సచివాలయ వీఆర్వోల ద్వారా నోటీసులు అందజేస్తున్నామని చెప్పారు.

ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఉగాది ఉత్సవాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పండుగరోజు పంచాంగశ్రవణం, కవి సమ్మేళనం, పురస్కారాల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులు, క్రీడలు, విద్య, వైద్యం, ఇతర సాంస్కృతిక రంగాలలో విశిష్ట ప్రతిభ కనబరచిన పురస్కార గ్రహీతలను గుర్తించి ఉత్సవాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహన్, డీఈవో జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేస్తున్న అతిథులు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి బాలరాజు, ఎస్‌వీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, హెచ్‌ఆర్ వీల్స్ ఇండియా లిమిటెడ్ మేనేజర్ దినకర్, తెలంగాణ జెన్‌కో డీఈ రూపేష్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. వివిధ కోర్సుల్లో తృతీయ సంవత్సరం చదువుతూ 20 పరిశ్రమలు నిర్వహించిన ప్రాంగణ ఉద్యోగ ఎంపికల్లో అర్హత సాధించిన 516 మంది విద్యార్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్‌ను అతిథుల చేతులమీదుగా అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాలిసెట్ 2025కి హాజరవుతున్న అభ్యర్థులకు ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్ ఇస్తున్నామని తెలిపారు.

జాతీయ త్రోబాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గడివేముల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిమద్దెల హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు వెంకటదేవేంద్రకుమార్, మోహన్, మంజూష, సాయిమణి, మోహిణి, నిర్మల ఇందు, సమీన, సహన భానులు 32వ జాతీయ స్థాయి త్రోబాల్ సబ్‌జూనియర్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బాలవెంకటేశ్వర్లు తెలిపారు. వీరు వెంకటాచలం మండలం కస్మూరులో జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబరిచి ఈనెల 29, 30 తేదీల్లో ఛతీస్‌ఘడ్‌లోని గురునానక్ సీనియర్ సెకండరి స్కూల్ సెక్టార్-6లో జరిగే 32వ జాతీయ స్థాయి త్రోబాల్ సబ్‌జూనియర్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఉత్తమ ప్రతిభకనబరిచిన క్రీడాకారులను హెచ్‌ఎం ప్రతాప్, ఉపాధ్యాయులు మల్లారెడ్డి, ఆనంద్‌బాబులు అభినందించారు.

పండుగ రోజుల్లోనూ రిజిస్ట్రేషన్ సేవలు

ఆత్మకూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఈ నెల 30, 31 తేదీల్లో ఉగాది, రంజాన్ పర్వదినాలు ఉన్నప్పటికీ ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు అందుబాటులో ఉంటాయని సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్‌కరీం శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్లు అధికంగా జరిగే అవకాశం ఉందన్నారు. ఇందుకు గాను ఆ రెండు రోజుల్లో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు.

నందికొట్కూరు: ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఖజానాను పెంచేందుకు సెలవు రోజుల్లో కూడా నందికొట్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పని చేస్తుందని సబ్ రిజిస్ట్రారు ఎస్‌ఎం మౌలా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున మార్చి 30, 31 తేదీల్లో ప్రజలు తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చిని తెలిపారు.

పాణ్యం: పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పండుగ సెలవులు లేవని సబ్ రిజిస్ట్రార్ నరేంద్రకుమార్ రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 30 తేదీ ఉగాది, 31 వతేదీన రంజాన్ పర్వదినాలలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు పని చేస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి'

గడివేముల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని ఓంకార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సూచించారు. వివిధ గ్రామాలకు 520 మంది కాశీయాత్రకు తీసుకెళ్లి వారి స్వగ్రామాలకు వచ్చిన సందర్భంగా మండలంలోని కరిమద్దెల గ్రామంలో శుక్రవారం అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామస్థులు ఓంకార సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సన్మానించారు. టీడీపీ నాయకుడు ఈశ్వర్‌రెడ్డి, గ్రామస్థులు శివయ్య, కొండారెడ్డి, సావిత్రమ్మ పాల్గొన్నారు.

'న్యాయం చేయాలి'

నంద్యాల హస్పటల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం బిల్లుల చెల్లింపులకు నోచుకోని కాంట్రాక్టర్లకు తగు రీతిలో న్యాయం చేయాలని కోరుతూ స్టేట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ కుమార్ సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. విజయ కుమార్ మాట్లాడుతూ ఆర్థిక ఒత్తిళ్లతో చనిపోయిన ముగ్గురు కాంట్రాక్టర్ల కుటుం బాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలకు అడ్డుగా ఉన్న సాంకేతిక సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు. అలాగే కోర్టు నుంచి వచ్చిన ఆర్డర్ ప్రకారం అన్ని చెల్లింపులు చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వంగ.. బెంగ

- 30 కేజీల వంకాయల బాక్సు ధర రూ.90
- గిట్టుబాటు ధర లేకపోవడంతో అన్నదాతల ఆవేదన



దిగుబడిని చూపుతున్న రైతు నాగేశ్వరరావు

కొత్తపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది కంటే ఈ ఏడాది వంకాయ కాపు బాగానే ఉన్నప్పటికీ మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్తపల్లి మండలంలో ఈ ఏడాది రబీ సీజన్‌లో బావులు, బోర్ల కింద సుమారు 30 ఎకరాల్లో వంకాయ పంటను సాగు చేశారు. ఉద్యాన వన శాఖ అధికారులు మాత్రం కూరగాయల పంటలు సాగు చేయండి.. ప్రభుత్వం తరుపున ప్రోత్సాహం అందిస్తామని చెబుతున్నారే గానీ క్షేత్రస్థాయిలో ఎలాంటి ప్రోత్సాహం లేక రైతులు లబోదిబోమంటున్నారు. గత ఏడాది వంకాయకు మంచి గిట్టుబాటు ధర ఉండటంతో ఎంతో ఆశతో ఇప్పుడు వంకాయ చేస్తే మంచి దిగుబడి వచ్చింది కానీ, మార్కెట్‌లో ధర పతనం కావడంతో రైతుల అప్పులపాలు కావాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30 కేజీల వంకాయ బాక్సును ఆత్మకూరు మార్కెట్‌లో విక్రయించేందుకు వెళితే కేవలం రూ.90 మాత్రమే అడుగుతున్నారని తెలిపారు. దీంతో రైతులకు రవాణా ఖర్చులు రావడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉద్యానవన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రైతులను అన్నివిధాలా ఆదుకోవాలని కోరుతున్నారు.



నాగంపల్లిలో సాగు చేసిన వంగ పంట

రెండెకరాల్లో సాగు చేశా

ఓర్వకల్లు మండలంలోని నన్నూరు నుంచి వంకాయ నార కొనుగోలు చేసి రెండెకరాల్లో సాగు చేశాను. ఎకరాకు సుమారు 80వేల వరకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టాను. పంట బాగానే ఉన్నా రైతుకు తగ్గ ఫలితం లేదు. చేసేదేమీ లేక పంటను అలాగే వదిలేశాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

- నాగేశ్వరరావు, నాగంపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి

ఎకరాన్నర పొలంలో వంకాయ పంటను సాగు చేశాను. పంట బాగానే ఉంది. మార్కెట్‌కు వెళితే ధర లేదు. పొలంలోనే పశువులకు మేతగా వేయాల్సిన పరిస్థితి నెలకొంది. భారీగా పెట్టుబడి పెట్టి వంకాయ సాగు చేశాను. ప్రభుత్వం అన్ని విదాలా ఆదుకోవాలి.

కృష్ణుడు, నాగంపల్లి

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు సరికాదు: సీపీఎం





ఆత్మకూరు, నందికొట్కూరులో విద్యుత్ అధికారులకు వినతి పత్రాలు అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్ భారం తగదని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు సరికాదని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు రణధీర్, సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ శివార్లలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు వీరన్న, సురేంద్ర, కిరణ్, మల్లయ్య, మహ్మద్, అంబయ్య, నాగేంద్రబాబు ఉన్నారు.

నందికొట్కూరు: ప్రజలపై విద్యాత్ భారం తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని విద్యుత్‌శాఖ ఏడీ కార్యాలయం ముందు విద్యుత్ ప్రైవేటీకరణ, విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ శెకి ఒప్పందంతో విద్యుత్ చార్జీలను పెంచుతూ పేద ప్రజల రక్తాన్ని కూటమి ప్రభుత్వం పీల్చుతోందని మండిపడ్డారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీ శ్రీనివాసులు, ఏఈ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఎం నాయకులు పక్కీర్‌సాహెబ్, కర్ణ, గోపాలకృష్ణ, శ్రీనివాసులు, నాగన్న, బాబుకొంగర, వెంకటేష్, మధు బాబు నాయుడు, అబ్దుల్ రషీద్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తను విధుల్లోకి చేర్చుకోవాలి

ఆత్మకూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరు పీహెచ్‌సీ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆశాకార్యకర్త విమలను రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తొలగించడం అన్యాయమని, ఆమెను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధికకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మల్లయ్య, పుల్లయ్య, ప్రసాద్, షబ్బీర్, నాగరాజు, శ్రీను, రాజేష్, ఓబులేసు తదితరులు ఉన్నారు.

'వక్ఫ్ సవరణ బిల్లు సరికాదు'



చేతికి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దేశంలోని ముస్లింల హక్కులను కాలరాసేలా వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం సరికాదని ముస్లింలు అన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని పలు మసీదుల్లో ముస్లింలు నల్లరిబ్బన్లు ధరించి శాంతియుతంగా నిరసనలు చేపట్టారు. అదేవిధంగా చేతికి నబ్బ రిబ్బన్లను ధరించి రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లును నితీష్, చంద్రబాబు కూటమి ప్రభుత్వాలు వ్యతిరేకించాలని ముస్లిం మైనార్టీ నాయకుడు మోమిన్ ముస్తఫా డిమాండ్ చేశారు.


టీడీపీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేయిస్తున్న టీడీపీ నాయకులు

సున్నిపెంట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సున్నిపెంట గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని టీడీపీ పార్టీ నాయకులు శుక్రవారం తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. సున్నిపెంటలోని బస్టాండ్ సర్కిల్, వైజాక్ క్యాంప్, పూర్ణానంద ఆశ్రమం, సులేమాన్ సెంటర్, బేతేస్థ చర్చి మరికొన్ని ప్రదేశాలలో చెత్తాచెదారం పేరుకుపోయిన విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సూచనల మేరకు టీడీపీ నాయకులు ఉమా, మల్లేష్, శివారెడ్డి, శ్రీను తదితరులు ఎక్స్‌కావేటర్, ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి చెత్తాచెదారాన్ని తొలగించారు. టీడీపీ నాయకులు పారిశుధ్య పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్యవైశ్యులకు సరుకుల పంపిణీ



సరుకులు అందిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

వెలుగోడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకొని మండలంలోని పేద ఆర్యవైశ్యులకు కర్నూలు జిల్లా ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు భవనాశి నాగ మహేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం పండుగ సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లను వాసవి కాంప్లెక్స్‌లో ఆర్యవైశ్య మండల అధ్యక్షులు రాము, మండల మర్చెంట్ అసోసియేషన్ అధ్యక్షులు డివి సత్యనారయణ చేతుల మీదుగా పంపిణీ చేశారుమండలంలోని 40 మంది నిరుపేద ఆర్యవైశ్యులకు కిట్లను అందించినట్లు తెలిపారు. సంజీవరాయుడు, నాగర్జున, మల్లికార్జున, రవిప్రసాద్, సింహాద్రి ప్రసాద్, హనుమంతు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో పల్లకీ సేవ



మహానందిలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీ ఉత్సవాన్ని ఆలయ వేదపండితులు, అర్చకులు వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో ప్రత్యేక పల్లకిపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ఆశీనులు గావించారు. ప్రత్యేక పూజలు జరిపారు. వేదమంత్రాలతో ఆలయ మెదటి ప్రాకారంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రారంభం



క్షయవ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్న డీఎంహెచ్‌వో

నంద్యాల హస్పిటల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లాలో సీవై-టీబీ క్షయవ్యాధి నిర్ధారిత అధునాతన స్క్రీనింగ్ పరీక్షను శుక్రవారం ఎన్‌జీవోస్ కాలనీలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.వెంకటరమణ, క్షయనివారణ అధికారి డా.శారదాబాయి ప్రారంభించారు. దీనిద్వారా క్షయవ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని డీఎంహెచ్‌వో అన్నారు. సీవై-టీబీ పరీక్ష కిట్లు జిల్లాలోని అన్ని సామాజిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు, టీబీ మెడికల్ ఆఫీసర్లు డా. చంద్రకాంత్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శాంతిరాం కళాశాలలో రక్తదాన శిబిరం

పాణ్యం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం ఫార్మసీ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శాంతిరాం వైద్యశాల, పార్మసీ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన శిబిరాన్ని కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ చెట్టి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఎల్లాసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకం వాయిదా

- ఆశావహుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ



నందికొట్కూరు మార్కెట్ యార్డు

నందికొట్కూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 47 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్‌లను కూటమి ప్రభుత్వం నియమించింది. అందులో 37 టీడీపీ, 8 జనసేన, 2 బీజేపీ నాయకులకు దక్కాయి. అయితే నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను కూడా ఈ జాబితాలోనే ప్రకటిస్తారని ప్రచారం జోరుగా సాగింది. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు ఎంతో ఉత్కంఠతతో ఎదురు చూశారు. కాని నందికొట్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి వీరం ప్రసాద్‌రెడ్డి, పోతుల రఘురామిరెడ్డిలు పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రతిపాదించిన వీరం ప్రసాద్‌రెడ్డి పేరు నేడు ప్రకటిస్తారని అంతా అనుకున్నారు. అయనందికొట్కూరు ఏఎంసీ చైర్మన్ పదవిని ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టారు. దీంతో నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి వర్గంలో ఉన్న పోతుల రఘురామిరెడ్డి గత రెండు రోజులుగా విజయవాడలో కూర్చొని అధిష్ఠానంతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో మొదటి విడతలో ప్రకటించాల్సిన నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పేరు వాయిదా పడింది. చైర్మన్ ప్రకటన వాయిదా పడడంతో ఆశావాహుల్లో తీవ్ర ఉత్కంఠత నెలకొంది.

గ్రామాభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే బుడ్డా



ఎర్రగుంట్లలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి

బండిఆత్మకూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగుంట్ల, కడమలకాల్వ, పెద్దదేవళాపురం గ్రామాల్లో శుక్రవారం రూ.67 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపడతామన్నారు. రబీలో కేసీ, తెలుగుగంగ కాల్వల కింద పంటలు సాగు చేసిన రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నీరు అందిస్తామని చెప్పారు. అనంతరం బండిఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ శాఖ రైతులకు మంజూరు చేసిన పనిముట్లను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కేసీ కెనాల్ చైర్మన్ రామలింగారెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, మనోహర్‌చౌదరి, బుగ్గరాముడు, జగన్మోహన్‌రెడ్డి, సిద్ధయ్య, రఘురెడ్డి, మల్లికార్జునరెడ్డి, మదన భూపాల్, సుబ్బలక్ష్మయ్య, కృష్ణనాయక్, రామలింగం, ప్రసాద్, సర్పంచ్ శ్వేత కుమారి పాల్గొన్నారు.

మహానంది: ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్‌సిక్స్‌తో పాటు సంక్షేమ పథకాల అమలు చెయ్యడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మహానంది మండలం అల్లీనగరం, సీతారామపురం, మసీదుపురం గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్లను రహదార్లను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. కేసీ కెనాల్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి, ఎంపీపీ యశస్వినిరెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జి నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు క్రాంతికుమార్, సుంకులయ్య, ఎంపీడీవో మహమ్మద్ దౌలా, హౌసింగ్ ఏఈ షపివుల్లాతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే జయసూర్య



నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పాములపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. క్రిష్ణనగర్, వేంపెంట, లింగాల, పాములపాడు, రుద్రవరం గ్రామాల ప్రజలు ఐదుగురికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ. 10,34,053 చెక్కులను అందించారు. క్రిష్ణానగర్ గ్రామ శివార్లలో ఇటీవల వీచిన ఈదురు గాలులకు నేలకొరిగిన వరి పంటలను పరిశీలించి రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో 39 సీసీ రోడ్లు నిర్మించామని చెప్పారు. టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, తిమ్మారెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, చంద్రశేఖర్, లక్ష్మీకాంతరెడ్డి, రామసుబ్బమ్మ, కృష్ణ, ఆదిరెడ్డి, మోహన్‌గౌడ్, వినయ్, రాజేశ్, లెనిన్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

- వేంపెంటలో హెల్త్ సబ్‌సెంటర్‌ను ఎమ్మెల్యే జయసూర్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో హెల్త్ సెంటర్‌కు తాళం వేస్తూ ఎమ్మెల్యే కంటబడ్డారు. హెల్త్ అసిస్టెంట్ నారయణమ్మతో పాటు మరో ఇద్దరివి రిజిస్టర్‌లో 14వ తేదీ నుంచి సిబ్బంది సంతకాలు లేవని, ఐదుగురు సిబ్బందికి గానూ ఒక్కరూ లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు తెలిపారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

బండిఆత్మకూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కార్యదర్శి అక్బర్ అన్నారు. శుక్రారం సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన సమస్యలు తాగు నీరు, దెబ్బతిన్న బీ కోడూరు రహదారి, మురుగు కాల్వలను ఆయన పరిశీలించారు. త్వరలోనే సర్పంచ్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని సీపీఎం నాయకుడు డేవిడ్‌కు సచించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

బండిఆత్మకూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నవనందుల్లో ఒకటైన శివనంది ఆలయ హుండీని నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం ఆలయ ఈవో నాగప్రసాద్ హుండీల సీజ్‌ను తొలగించి లెక్కిచగా రూ.48636 లభించిందని చెప్పారు. అర్చకులు, గ్రామస్థులు మదనభూపాల్, చిన్న పాపయ్య పుష్పరాజ్, సుబ్బరాయుడు, సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

కిరాణ షాపులో అగ్ని ప్రమాదం

మిడుతూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మాసపేట మజార గ్రామమైన కలమందలపాడులో చిన్న మౌలాలికి కిరణ షాపులో శుక్రవారం ప్రమాదవశాత్తులో అగ్ని ప్రమాదం జరిగింది. ఉగాది, రంజాన్ పండగల సందర్భంగా కిరాణం సరుకులు ఎక్కువగా తీసుకొచ్చామని, దాదాపు రూ.1.50 లక్షల విలువ చేసే సరుకులు కాలిపోయినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రేపు నాటక ప్రదర్శన

పాములపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు గ్రామంలో ఆదివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం గురించి ఉచిత నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకుడు తిమ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ కళా ప్రదర్శనకు కళాభిమానులు తరలివచ్చి విజయంతం చేయాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీశైలం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో శుక్రవారం మధ్యాహ్నం పేక ఆడుతున్న ముగ్గురిని సీఐ జి.ప్రసాదరావు అరెస్టు చేశారు. వివరాలివీ.. శ్రీశైలంలో టూరిస్ట్ బస్టాండ్ పార్కింగ్ స్థలం వద్ద కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోట్ జిల్లా హుంగుండు తాలూకా హీరేసింగనగుట్టి గ్రామానికి చెందిన ముగ్గురిని అరెస్టు చేశారు. సీసీ కెమెరాల ద్వారా శ్రీశైలం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ తన సిబ్బంది శివ మహేంద్రారెడ్డి, మహేష్‌తో వెళ్లి పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మహానందిలో చోరీ

మహానంది, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కర్ణాటకకు చెందిన భక్తుల సొమ్మును శుక్రవారం చోరీ చేశారు. వివరాలివీ.. రాయచూరుకు చెందిన జగదీష్ అనే భక్తుడు మిగతా భక్తులతో కలిసి మహానందికి వచ్చారు. ఆలయవ వెలుపల ఉన్న షవర్ల వద్ద పుణ్య స్నానాలు చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తమ లగేజీల వద్ద చిల్లర వేసి మీ డబ్బులు పడిపోయాయని చెప్పడంతో వాటిని తీసుకొని చూసే లోగానే లగేజీ ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపారు. అందులో రూ.40 వేలు నగదు ఉన్నట్లు తెలిపారు. తన సెల్‌ఫోన్‌ను సమీపంలోని పరిసరాల్లో గర్తించిన భక్తుడు తిరిగి తనకు అప్పగించారని చెప్పారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

'నష్ట పరిహారం చెల్లించాలి'

పాణ్యం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. ఘటనా స్థలాన్ని నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఆయన మట్లాడుతూ కొండజూటూరు, పిన్నాపురం గ్రామాలకు చెందిన శ్రీరాములు, వెంకటకృష్ణ, సుధాకర్, ధనికొండ గొర్రెలను మేపుకోవడానికి వెళ్తూ హైవే దాటుతుండగా ప్రైవేటు బస్సు ఢీకొనడంతో 18 గొర్రెలు అక్కడికక్కడే చనిపోయాయన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ సులోచన, ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

చెంచులను ఐటీడీఏలో చేరుస్తాం



ఎకో టూరిజం పార్కులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 28(ఆంధ్రజ్యోతి) : నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్ల గ్రామంలో నివసిస్తున్న చెంచులను ఐటీడీఏలో చేర్చి అన్ని రకాల సంక్షేమ పథకాలు వర్తించేలా చేస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శుక్రవారం అన్నారు. మొదటగా సర్వాలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పచ్చర్ల గ్రామంలో తల్లిదండ్రులు భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డి విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే ఎకో టూరిజంలో పర్యటించారు. అనంతరం అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉదయ్‌దీప్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రాజు, తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, తెలుగుగంగ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సంజీవ కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు వెలుగోడు మహేష్, జమ్మన్న, విజయ భాస్కర్‌రెడ్డి, రామనాగిరెడ్డి, లక్ష్మీకాంత్, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

బనగానపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె పట్టణ శివారులోని యాగంటి రహదారిలోని షిర్డీసాయిబాబా ఆలయ 16వ వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబాను మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

కొలిమిగుండ్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాఘవరాజుపల్లెలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరిగిన ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ఆ సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మల్లు వెంకటరెడ్డి భక్తులకు ఆధ్యాత్మిక బోధనలు, హిందూ ధర్మం గొప్పదనం, ఐక్యమత్యం తదితర అంశాలపై బోధనలు చేశారు. గురూజీ జయదేవ్ స్వామి, ధర్మ ప్రచారకులు ఆంబటి చంద్రశేఖరరెడ్డి, ఎరికలరెడ్డి, ఆదిరెడ్డి, సాయిప్రతాప్‌రెడ్డి, రమాదేవి, వెంకటనారాయణమ్మ, భక్తులు పాల్గొన్నారు.

గృహంలో బైల్పడిన పురాతన ఆలయం

సంజామల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పేరుసోముల గ్రామంలోని ఓ గృహంలో శుక్రవారం పురాతన శివాలయం బయటపడింది. మూడు దశాబ్దాల క్రితం ఇక్కడ ఆలయం ఉండేదని, గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన స్థలంతోపాటు ఆలయం స్థలాన్ని విక్రయించగా గా, కొన్న వ్యక్తి ఆలయాన్ని పూడ్చేసి గృహం కట్టుకున్నాడు. అయితే ఈ మధ్య కాలంలో ఇంటి కుటుంబ సభ్యులు అనారోగ్యాలకు గురి కావడంతో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సూచన మేరకు ఆలయాన్ని పునరుద్ధరించేందుకు శుక్రవారం మట్టి తవ్వించారు. మహిళలు అధిక సంఖ్యలో వెళ్లి పూజలు చేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది.

మధ్యాహ్న భోజనంలో గుడ్డు ఏది?

రుద్రవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో రెండురోజులుగా మధ్యాహ్న భోజనంలో గుడ్డు ఇవ్వడం లేదు. పాఠశాలలో 1 నుంచి 5వతరగతి వరకు 86 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్న భోజనానికి 80 మంది విద్యార్థులు హాజరయ్యారు. పప్పు, అన్నం పెట్టారు. ఏజెన్సీ నిర్వాహకులు గుడ్డును సరఫరా చేయడం లేదు. ఈ విషయమై ఎంఈవో వీరరామయ్య మాట్లాడుతూ శ్రీరంగాపురం పాఠశాలకు గుడ్లు సరఫరా కాలేదన్నారు. ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి సరఫరా చేయాలని ఆదేశించామన్నారు.

ముస్లింల నిరసన

బనగానపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : పాలస్తీనాలోని అమాయక ప్రజలను ఇజ్రాయిల్ చంపడానికి నిరసిస్తూ బనగానపల్లెలో ముస్లింలు శుక్రవారం నిరసనలు తెలిపారు. పట్టణంలోని పాంచ్ కమాన్ మసీదు నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ నారాయణరెడ్డికి ముస్లింలు వినతిపత్రం సమర్పించారు. ఎస్ఐ దుగ్గిరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఈకేవైసీ గడువును పొడిగించాలి

డోన్ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ గడువును పొడిగించాలని సీపీఐ మండల కార్యదర్శి నారాయణ, పట్టణ సహాయ కార్యదర్శి పుల్లయ్య, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి వృద్ధి కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగమణికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో శివ, రాజు, మహేంద్ర పాల్గొన్నారు.

పాత విద్యుత్ స్తంభాలు మార్చండి

డోన్ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపంలోని కేఈ కృష్ణమూర్తి నగర్‌లో ఉన్న పాత విద్యుత్ స్తంభాలను మార్చాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయం వద్ద ఆందోళనలు చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ కమిటీ సభ్యులు చిన్న రెహిమాన్, నక్కి, హరి, నాగముద్దయ్య, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

మూడు చలివేంద్రాల ఏర్పాటు

బేతంచెర్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు నగర పంచాయతీ ఆధ్వర్యంలో మూడు చలివేంద్రాలను ప్రారంభించినట్లు నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పుల్లమ్మ కల్యాణ మీపంలో చలివేంద్రం, కొత్తబస్టాండు సమీపంలోని పశువుల ఆసుపత్రి వద్ద, నగర పంచాయతీ కార్యాలయ సమీపంలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని నగర ప్రజలను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇబ్రహీం, రామాంజనేయులు, కో ఆప్షన్ సభ్యుడు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన ఏది..?

- వైద్యుల కోసం రోగుల ఎదురు చూపులు
- 10.40 గంటలకు ఇన్‌చార్జి వైద్యుల రాక
- డిప్యుటేషన్‌పై వెళ్లిన ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు
- రోగులకు వైద్య సేవలు అందక ఇబ్బందులు



చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాల



9.30 గంటలకు స్టాఫ్ నర్స్ వద్ద చికిత్స కోసం నిలిచిన రోగులు

చాగలమర్రి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని 24 గంటల ప్రభుత్వ వైద్యశాలలో ప్రజలకు ఆశించిన స్థాయిలో రోగులకు వైద్య సేవలు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శుక్రవారం ప్రభుత్వ వైద్యశాల సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, అక్కడ ఉన్న ఇబ్బందులను తెలుసుకునే ప్రయత్నం 'ఆంధ్రజ్యోతి' చేసింది.

తప్పని నిరీక్షణ

ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. వైద్యశాలలో ఇద్దరు రెగ్యులర్ వైద్యులను,



వైద్యం కోసం చెట్టు కింద నిరీక్షణ చేస్తున్న హుసేన్ దంపతులు

ముగ్గురు స్టాఫ్ నర్సులను, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టుతో పాటు కాంట్రాక్టు ఉద్యోగులను నియమించింది. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహించాలి. కానీ సమయానికి రావడం లేదని, దీంతో తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు రోగులు తెలిపారు. ఓపీ చీటి రాయించుకొని చికిత్సల కోసం నిరీక్షణ చేయాల్సి వస్తోందని అంటున్నారు. అలా గే వైద్యశాలలో 63 రకాల పరీక్షలు చేయాలి. కానీ కొన్ని రకాల పరీక్షలు మాత్రమే చేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. వైద్యశాలలో ఇద్దరు రెగ్యులర్ వైద్యులు ఎప్పుడు ఉంటారో ఎప్పుడు వస్తారో, సెలవుపై వెళ్లారా, 104 సేవలకు వెళ్లారా అన్న విషయాల గురించి తెలియక రోగులు, సిబ్బంది సైతం అవస్థలు పడుతున్నారు. వైద్యులు సమయపాలన పాటించి సకాలంలో వైద్య సేవలు అందించేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

స్టాఫ్ నర్సే దిక్కు

ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు రాకపోవడంతో 9 గంటల నుంచి 10.30 గంటల వరకు తానే వైద్యురాలి గా రోగులకు స్టాఫ్ నర్స్ విజయలక్ష్మి వైద్య చికిత్సలు అందించారు. ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, మరి కొందరు క్రితంలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఫార్మ మెడికల్ సిబ్బంది మనోహర్ రోగులకు మందులను పంపిణీ చేశారు. నందాలకు చెందిన ఉసేన్ అనే వ్యక్తి కడుపునొప్పి భరించలేక చికిత్స కోసం వచ్చి చెట్టు కింద తన భార్యతో కలిసి వైద్యుల కోసం నిరీక్షణ చేశారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలను స్టాఫ్ నర్స్ చేయాల్సి వచ్చింది.

10.40 గంటలకు ఇన్‌చార్జి వైద్యుల రాక

రుద్రవరం ప్రభుత్వ వైద్యశాలలో ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న శివమోహన్ 10.40 గంటలకు చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలకు వచ్చారు. ఓపీ చీటీలతో నిరీక్షిస్తున్న రోగులకు వైద్య చికిత్సలు చేశారు. జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ అధికారిగా వైద్య పరీక్షలు చేయనున్నట్లు వైద్యులు శివమోహన్ తెలిపారు. వైద్యశాలలో విధులు నిర్వహించే ఇద్దరు వైద్యులు సెలవుపై వెళ్లారా, ఎమ్‌డీవోకి వెళ్లారా అన్న విషయం గురించి తనకు తెలియదన్నారు. రెండు రోజులుగా వైద్యశాలలో ఇన్‌చార్జిగా కొనసాగాలని ఆదేశాలు ఇచ్చారని అన్నారు.

గృహ లబ్ధిదారులకు అదనపు సాయం

చాగలమర్రి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ప్రభుత్వ గృహ నిర్మాణాల లబ్ధిదారులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, చెంచులకు అదనపు సహాయం కింద రూ.5.96 కోట్లు మంజూరైందని జిల్లా హౌసింగ్ పీడీ హరిగోపాల్ తెలిపారు. శుక్రవారం చాగలమర్రి కస్తూర్బా సమీపంలోని లబ్ధిదారుల నిర్మించుకున్న గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని కోరారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.70 వేలు, చెంచులకు రూ.లక్ష అదనపు సహాయం మంజూరైందని అన్నారు. జిల్లాలో 9,432 గృహాలకు 4,212 గృహాలు పూర్తయ్యాయని, మిగిలినవి మే చివరి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ లక్ష్యం అన్నారు. చాగలమర్రి మండలంలో 260 మంది లబ్ధిదారులకు రూ.38.42 లక్షలు అదనపు నిధులు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. పీఎంఏవై సర్వే ద్వారా గృహాల మంజూరు కోసం ఈనెల చివరి లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈ విజయ్‌కుమార్, ఏఈ నరసింహారావు, వర్క్ఇన్‌స్పెక్టర్ ఓబులేసు ఉన్నారు.



చాగలమర్రిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ హరిగోపాల్

రిటైర్డు ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



మంత్రి బీసీ దంపతులను సత్కరిస్తున్న రిటైర్డు ఉద్యోగులు

బనగానపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం రిటైర్డు ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దనరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని పొదుపు భవనంలో మంత్రి బీసీ జనార్దనరెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులను బనగానపల్లె డివిజన్ రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పక్కీరారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగుల సూచనలు సలహాలతోనే బనగానపల్లెను అభివృద్ధి బాటలో నడిపిస్తున్నట్లు తెలిపారు. తన సోదరుడు మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి బనగానపల్లె పెన్షనర్ల సంఘానికి రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని ప్రతిపాదన తీసుకురాగా తాను ఎంతో సంతోషించి స్థలం ఇచ్చామని, ఇక్కడ పెన్షనర్ల సంఘం భవనం నిర్మించుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ పెన్షనర్ల కార్యాలయంలో వ్యాయామాలు చేసి ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, ట్రెజరర్ బాల స్వామి, సుధాకర్‌రెడ్డి, జ్యోతిష్యం వెంకటరాముడు, మద్దిలేటి, రామసుబ్బయ్య డివిజన్‌లోని పెన్షనర్ల సంఘం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి

సంజామల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి సాధించొచ్చని జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్ సలాం అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో డీ.ఆర్‌డీ.ఏ అధికారులు ప్రకృతి వ్యవసాయంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్ సలాం మాట్లాడారు. రసాయన క్రిమి సంహారక మందులను తగ్గించి ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలన్నారు. అనంతరం వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి భూమి లేని మహిళలు 365 రోజులు పెరటి తోటలు వేసుకోవాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెలుగు వీవోఏలు, రైతులు పాల్గొన్నారు.

పాణ్యం: ప్రకృతి వ్యవసాయ విధానంపై మహిళలకు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి రాజేష్, ఏపీఎం మల్లికార్జున అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై మహిళలకు అవగాహన కల్పించారు. సమావేశంలో పొదుపు మహిళలు, సిబ్బంది, వెలుగు సీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ అబ్దుల్ సలాం

దొర్నిపాడు: మండలంలోని వెలుగు కార్యాలయంలో వ్యవసాయాధికారి ప్రమీల ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఎన్‌పీఎమ్ రామకృష్ణ, డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బాబు, డీఆర్‌డీఏ క్లస్టర్ కోఆర్డినేటర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సిబ్బంది ఉన్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

బేతంచెర్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పాలక ప్రభుత్వం ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని బేతంచెర్ల మండలం పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బ్రదర్ దాసన్న, బ్రదర్ డీపీఎస్ ప్రసాద్ కోరారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బేతంచెర్ల మండలం పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో పాస్టర్లపై, చర్చిలపై దాడులు అధికమయ్యాయని, ప్రభుత్వం బాధ్యత వహించి దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిటీకి వినతి పత్రం అందజేశారు. పాస్టర్లు కేకుమార్, ఆనంద్, మల్లేష్, జీసెలుపాల్, దేవరాజు, సురేష్, సుధీర్, భాస్కర్, మహేష్ పాల్గొన్నారు.



డీటీకి వినతి పత్రాన్ని ఇస్తున్న పాస్టర్లు

రిజర్వాయర్ వద్ద కారు బోల్తా

అవుకు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అవుకు రిజర్వాయర్ మలుపు వద్ద శుక్రవారం కారు బోల్తా పడింది. కారులోని నలుగురు వ్యక్తులు స్వల్పగాయాలతో బయట పడ్డారు. అనంతపురం నుంచి బనగానపల్లెకు వెళుతున్న కారు రిజర్వాయర్ మలుపు వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. స్థానికులు మెటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తులను ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పుచ్చకాయలపల్లెలో చోరీ

ఉయ్యాలవాడ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుచ్చకాయలపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ బాధితురాలు లక్ష్మీదేవి గురువారం రాత్రి వాళ్ల బంధువుల ఇంటికి వెళ్లి, తిరిగి శుక్రవారం ఉదయం వచ్చి చూడగా, ఇంటి తాళాలు, బీరువాను పగలగొట్టి అందులోని బంగారు తాళిబొట్టు, రూ. 10 వేలు నగదు దుండగులు చోరీ చేసినట్లు తెలియజేసింది. వెంటనే పోలీసులకు సమాచారం తెలిపిన వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిసిందన్నారు. ఆమె

ముగిసిన వేలం

డోన్ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రసాద్‌గౌడ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు బహిరంగ వేలం శుక్రవారం ముగిశాయి. ఈ బిడ్డింగులో రోజువారి మార్కెట్, వారపు సంత మార్కెట్, బస్టాండు, మాంసపు మార్కెట్, జంతువధశాల వేలాలు నిర్వహించారు. మొత్తం రూ. 19,10,000లకు పి.గురుస్వామి అనే వేలందారుడు దక్కించుకున్నారు. గత ఏడాది కంటే 7.10లక్షల ఆదాయం ఎక్కువగా వచ్చినట్లు కమిషనర్ ప్రసాద్‌గౌడ తెలిపారు. కార్యక్రమంలో ఆర్వో వెంకటరెడ్డి, ఆర్ఐ మోహన్, సిబ్బంది శిరీష్ పాల్గొన్నారు.

రామాపురంలో..

అవుకు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురంలో వేలం నిర్వహించినట్లు ఈవోపీఆర్డీ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే గ్రామ పంచాయతీకి రూ.4.66 లక్షల ఆదాయం చేకూరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భాస్కర్ నాయుడు ఎన్నిక

డోన్ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డోన్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాస్కర్‌నాయుడు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని కోర్టులో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి భాస్కర్ నాయుడు సమీప ప్రత్యర్థి డీపీ రంగారెడ్డిపై గెలుపొందారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా మద్దయ్య యాదవ్, జాయింట్ సెక్రటరీగా రవిమోహన్, ట్రెజరర్‌గా మంగమూరి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా కేజీ చంద్రశేఖర్, మహిళా ప్రతినిధిగా మీనుగు కుమారి, సభ్యులు గెలుపొందారు. నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు సబ్ కోర్టు సివిల్ న్యాయాధికారి తంగమణి మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే గెలుపొందిన బార్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో రాముడు, మద్దిలేటి స్వామి, న్యాయవాదులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల నగర పంచాయతీ అభివృద్ధికి ఆయా వార్డుల సభ్యులందరూ ఐకమత్యంతో సహకరించాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ హరి ప్రసాద్, తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో తాగునీటి ఎద్దడితో పాటు డ్రైనేజీ కాలువల శుభ్రం చేయించాలని చైర్మన్‌కమిషనర్ల దృష్టికి సమస్యలు తీసుకువచ్చారు. స్పందించిన వారు నగర పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే కోటా కింద రూ.21 కోట్లు మంజూరయ్యాని, నిధులతో పనులు చేపడుతామన్నారు. అలాగే అమృత్2.0 పథకం కింద రూ. 49.99 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధుల ద్వారా ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, సిబ్బంది ఉన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్



భోజనాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షాదీ ఖానాలో ముస్లింలకు శుక్రవారం రాత్రి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఇఫ్తార్ ఇచ్చారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, సీనియర్ నాయకులు బుగ్గన ప్రసన్నలక్ష్మి, చంద్రశేఖర్, తిరుపాలేశ్ చౌదరి, జాకీరుల్లాహ్, మేకల నాగరాజు, రబ్బాని, వంశీ కృష్ణ, కౌన్సిలర్లు రామాగోపాల్, ఫయాజ్ ముస్లింలు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని చిలకలూరులో శుక్రవారం రాత్రి ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిల ప్రియ పాల్గొన్నారు. ముస్లింలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో నాయకులు రఫీక్, హుసేన్‌బాషా, రామనారెడ్డి పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త చక్రం షబ్బీర్ కాంప్లెక్స్ భవనంలో శుక్రవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్‌బాబులాల్, మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

డోన్ రూరల్: పట్టణంలోని ఎంసీఆర్ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం రాత్రి రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దర్శనం సుబ్బారెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. టీడీపీ నాయకులు ధర్మవరం మన్నె గౌతమ్‌కుమార్ రెడ్డి, సీఎం శ్రీనివాసులు ఆరేకల్ రామచంద్ర, చిన్న నాగిరెడ్డి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శివరామిరెడ్డి



అధ్యక్షుడిగా ఎన్నికైన శివరామిరెడ్డిని అభినందిస్తున్న న్యాయవాదులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ కోర్టు న్యాయ వాదుల బార్ అసోసియేషన్‌కు శుక్రవారం జరిగిన ఎన్నికల్లో సీ శివరామిరెడ్డి అధ్యక్షుడిగా విజయం సాధించారు. తన ప్రత్యర్థి సుబ్బరామిరెడ్డిపై ఆయన 91 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. అలాగే వైస్ ప్రెసిడెంట్‌గా కే నరసింహారెడ్డి, జనరల్ సెక్రటరీగా అంబటి గోపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా మురళీ మోహన్ విజయం సాధించారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులతోపాటు ఎన్నికైన అభ్యర్థులకు ఆళ్లగడ్డ కోర్టు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



దొర్నిపాడులో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దొర్నిపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు గ్రామంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర దేవాలయంలో ఉగాది పండుగ పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని భాస్కర్ రెడ్డి (బ్రదర్) ఆధ్వర్యంలో పురోహితుడు బోరనాల ప్రసాద్‌శర్మ నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, అనంతరం శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలో గ్రామంలో శివపార్వతులు ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు. కల్యాణానికి తరలివచ్చిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులున్నారు.

వైభవంగా మాసశివరాత్రి పూజలు

చాగలమర్రి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని బుగ్గమల్లేశ్వర ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రి పూజలను అర్చకస్వాములు వైభవంగా నిర్వహించారు. ఈశ్వరుడికి జల, పాలాభిషేకాలు చేశారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు శివప్రసాద్, అర్చకస్వాములు నవతా ప్రసాద్, మధు, వినోద్ కుమార్, రమేష్, సత్యం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉమామహేశ్వర స్వామి కల్యాణం

బనగానపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి ఉమామహేశ్వర స్వామి క్షేత్రంలో మాసశివరాత్రి సందర్భంగా ఉమామహేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాసశివరాత్రి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు మహేశ్వర శర్మ, అర్చకుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో చంద్రుడు, చంద్రమౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వర రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీమాత పల్లకీసేవ

బనగానపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో కామేశ్వరమ్మ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పీవీ. కుమార్‌రెడ్డి, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బదేరాత్

చాగలమర్రి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్‌మాసంలో వచ్చే ప్రధానమైన బదేరాత్ పండుగను శుక్రవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. చాగలమర్రి గ్రామంలోని పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండుగ విశిష్టత గురించి మౌలానాలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ ఖాజీ యూనస్, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

రుద్రవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలమూరు గ్రామంలో పశుగ్రాసం దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు పశుగ్రాసానికి నిప్పంటించారని శుక్రవారం బాధితుడు మునెయ్య తెలిపారు. పాడిగేదెల కోసం 600 కట్టలు వరిగడ్డి, ట్రాక్టరు చొప్ప నిల్వ చేసుకోగా, నిప్పంటైరని వాపోయారు. రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.